క్లుప్తంగా

ఇన్‌స్పెక్టర్‌కు సన్మానం

కాచిగూడ: నల్లకుంట పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్ ఓగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన బి.జగదీశ్వర్‌రావును బర్కత్‌పుర హౌసింగ్‌బోర్డు ఎల్‌ఐజీహెచ్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ పొడిశెట్టి కిషోర్, ఎన్.శరత్‌శ్యామ్ నేతృత్వంలో ప్రతినిధులు కలిసి ఘనంగా సత్కరించి అభినందించారు. విధి నిర్వహణలో అందరి సహకారంతో నేరాల నియంత్రణకు కృషి చేస్తానని ఇన్‌స్పెక్టర్ అన్నారు. సెంట్రల్ పీస్ కమిటీ ఈస్ట్‌జోన్ అధ్యక్షుడు ఎస్.నారాయణరెడ్డి, అసిస్టెంట్ సెక్రటరీ శ్యామ్, సయ్యద్ యూనుస్, సయ్యద్ ఖాలీద్, రమణరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పర్యవేక్షణ



పనులను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట: అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అధికారులను ఆదేశించారు. మంగళవారం గోల్నాక డివిజన్ మారుతినగర్‌లో సుమారు రూ.2 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను ఆయన పర్యవేక్షించారు. రోడ్లు తవ్వి రోజుల తరబడి వదిలేయకుండా తక్షణమే నిర్మించాలని అధికారులకు సూచించారు. అభివృద్ధి పనులతో స్థానిక ప్రజలకు దీర్ఘకాలికంగా అసౌకర్యం లేకుండా చూడాలన్నారు. జీహెచ్ఎంసీ అధికారులతో పాటు స్థానిక బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

శంకర్ మాకినేనికి ఇట్‌క్లా - సినారె అవార్డు

కాచిగూడ: రెండు దశాబ్దాలుగా అమెరికాలో తెలుగు భాషా సాంస్కృతిక వికాసానికి బహురూప సేవలందిస్తున్న గ్రేటర్ రిచ్మండ్ తెలుగు అసోసియేషన్ పూర్వ అధ్యక్షుడు శంకర్ మాకినేనికి ఇట్‌క్లా, సినారె -2023 ఎన్‌ఆర్‌ఐ సాంస్కృతిక అవార్డును అమెరికాలో బహూకరించనున్నారని ఇట్‌క్లా సంస్థ అధ్యక్షుడు, సంస్కృతి రత్న డాక్టర్ కె.ధర్మారావు ప్రకటించారు. పద్మభూషణ్ జ్ఞానపీఠ అవార్డు గ్రహీత, మహాకవి డాక్టర్ సి.నారాయణరెడ్డి 92వ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 5న ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఉత్తరాలపై పిన్‌కోడ్ సక్రమంగా రాయాలి



నల్లకుంట: పోస్టల్ ఉత్తరాలపై చిరునామాతో పాటు పిన్‌కోడ్ సరిగ్గా రాయాలని అంబర్‌పేట పోస్ట్‌మాస్టర్ బి.సుభాష్‌నాయక్ తపాలా సేవల వినియోగదారులకు సూచించారు. తద్వారా ఉత్తరాలు సరైన చిరునామాకు చేరవేయడానికి ఉత్తరాలు బట్వాడ చేసే సిబ్బందికి వీలవుతుందని తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. చాలా ఉత్తరాల్లో పిన్‌కోడ్ సరిగ్గా రాయకపోవడంతో ఉత్తరాల బట్వాడాలో జాప్యం జరుగుతుందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని తపాలా సేవలు వినియోగించుకొనే వారు ఉత్తరాలపై చిరునామాతో పాటు పిన్‌కోడ్ కూడా రాయాలని సచించారు.

నియామకం

అంబర్‌పేట: జాతీయ వెనుకబడిన తరగతుల అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా అంబర్‌పేటకు చెందిన ఆనంద్‌గౌడ్ నియమితులయ్యారు. మంగళవారం చెన్నైలో జరిగిన అసోసియేషన్ సమావేశంలో ఆయన నియామకాన్ని అసోసియేషన్ జాతీయ అధ్యక్షులు దినేష్‌యాదవ్ ఖరారు చేసినట్లు ఆనంద్‌గౌడ్ ఓ ప్రకటనలో తెలిపారు. జాతీయ స్థాయిలో జరిగిన సమావేశానికి ఓబీసీ కమిషన్ చైర్మన్ హంసరాజ్ గంగారామ్ సమక్షంలో తన నియామకం జరిగినట్లు పేర్కొన్నారు. తనకు అప్పగించిన బాధ్యతలను విజయవంతంగా నిర్వహిస్తానన్నారు. అసోసియేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్, మీడియా కన్వీనర్ కిరణ్‌కుమార్‌యాదవ్, తమిళనాడు అధ్యక్షులు ఎలోంగాలు పాల్గొన్నట్లు ప్రకటించారు.

కేబినెట్ నిర్ణయం అభినందనీయం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: హైదరాబాద్‌ను విశ్వనగరంగా అభివృద్ధి చేసేందుకు కేబినెట్ తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకం, అభినందనీయమని ఎంబీసీ జాతీయ కన్వీనర్ కొండూరి సత్యనారాయణ అన్నారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలో ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ విజయంతో ప్రపంచపటంలో నిలిచేలా హైదరాబాద్ మహానగరాన్ని విశ్వనగరంగా మారుస్తూ.. నిర్ణయాలు తీసుకోవడం గొప్ప పరిణామన్నారు. రూ.69,100 కోట్లతో భాగ్యనగర మెట్రోరైలు భారీ విస్తరణకు సీఎం అధ్యక్షతన కేబినేట్ నిర్ణయాలు హర్షనీయమన్నారు. 1951లో హైదరాబాద్ నగర నిర్మాణానికి పునాదిరాయి పడగా గత పాలకులు ఈ నగరాన్ని ఆర్థిక వనరులుగానే ఉపయోగించుకున్నారే తప్పా.. ఏ విధమైన అభివృద్ధికి దోహదపడలేదని విమర్శించారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ఏర్పడిన తరువాత గత 9 ఏళ్లలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారన్నారు.

ఆర్టీసీ విలీనం చరిత్రాత్మక నిర్ణయం



సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



రాంనగర్‌లో కండక్టర్లకు మిఠాయిలు తినిపిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్



ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు

ముషీరాబాద్: టీఎస్‌ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తు తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమైనదని ముషీరాబాద్‌కు చెందిన మూడు బస్సు డిపోల మాజీ గౌరవ అధ్యక్షులు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు అన్నారు. మంగళవారం ముషీరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో ప్రభుత్వంలో విలీనం చేయాలని ఎన్నో పోరాటాలు, ధర్నాలు, రాస్తారోకోలు చేసిన పట్టించుకోని ప్రభుత్వాలను చూశామని నేడు ముఖ్యమంత్రి కేసీఆర్ సహృదయంతో ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ఆర్టీసీ కార్మికులను హక్కులు, బాధ్యతలను కల్పిస్తు చారిత్రాత్మకమైన నిర్ణయం తీసుకున్నారని కొనియాడారు. చాలీచాలని జీతాలతో కాలం వెళ్లదీస్తున్న సుమారు 45 వేల మంది కార్మికులను ఆర్టీసీలో విలీనం చేయడం హర్షించదగ్గ పరిణామం అన్నారు. భవిష్యత్తు తరాలకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. దీంతో టీఎస్‌ఆర్టీసీ బలోపేతంతో పాటు కార్మికులకు ఉద్యోగ భద్రత కలుగుతుందని తెలిపారు. హైదరాబాద్ నగరానికి నలువైపుల మెట్రో రైలు ప్రాజెక్టును విస్తరించడానికి నిర్ణయం తీసుకోవడం కూడా సాహసోపేతమైన నిర్ణయం అని దీని కోసం సుమారు 60 వేల కోట్ల రూపాయలను కేటాయించడం శుభ పరిణామం అని అన్నారు. దీంతో నగరం నలువైపుల అభివృద్ధి జరుగుతుందని తెలిపారు.

ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు..

ముషీరాబాద్: టీఎస్‌ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తున్నట్లు సీఎం కేసీఆర్ ప్రకటించడంపై ఎమ్మెల్యే ముఠాగోపాల్ హర్షం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయంతో ఆర్టీసీ ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నిండాయని కొనియాడారు. మంగళవారం రాంనగర్ చౌరస్తాలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విలీన నిర్ణయం గొప్ప వరం లాంటిదని వారి కష్టాలన్ని ఏకకాలంలో పాగొట్టారన్నారు. ఆర్టీసీ విలీనంతో సంస్థకు భరోసా, ఉద్యోగులకు ఉద్యోగభద్రత కలుగుతుందని తెలిపారు. నష్టాల్లో ఉన్న ఆర్టీసీకి ప్రభుత్వంలో విలీనంతో ఊపిరిపోసినట్లు అయిందన్నారు. బీఆర్ఎస్ నాయకులు ముఠా జైసింహ, రావులపాటి మోజస్, ముఠా నరేష్, శివముదిరాజ్, కొండపల్లి మాధవ్, శ్యామ్‌సుందర్, వై.శ్రీనివాస్, దీన్‌దయాల్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రవియాదవ్, వల్లాల శ్రీనివాస్, వల్లాల శ్యామ్‌యాదవ్, ముదిగొండ మురళీ, పూస గోరఖ్‌నాథ్, కె.గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

వీఎస్‌ఆర్ ఆధ్వర్యంలో...

రాంనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్, కార్మిక నాయకులు వి.శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ముషీరాబాద్‌బస్ డిపో వద్ద కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ.. కేసీఆర్‌కు అనుకూలంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సిరిగిరి శ్యామ్, నేత శ్రీనివాస్, కార్తీక్‌యాదవ్, ప్రవీణ్, శ్రీనివాస్, అనిల్ కుమార్, జ్యానీ, కల్పన, రేఖ తదితరులున్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సంబరాలు

కాచిగూడ: ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తున్నట్లు క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకోవడంపై ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తూ ఆర్టీసీ కాచిగూడ, బర్కత్‌పుర డిపోలో కాచిగూడ బస్టాండ్ వద్ద కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మంగళవారం కాచిగూడ ఆర్టీసీ డిపో వద్ద జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పాల్గొని ఉద్యోగులు, బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలతో కలిసి సంబరాలు నిర్వహించుకున్నారు. టపాసులను పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఉద్యోగులు, సిబ్బందితో కలిసి ఎమ్మెల్యే సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలేరు మాట్లాడుతూ.. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంపై ఆర్టీసీ కార్మికులు సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటారన్నారు. బీఆర్ఎస్ కాచిగూడ డివిజన్ అధ్యక్షుడు ఎర్ర భీష్మదేవ్, మున్నాసింగ్, మన్నే శ్రీనివాస్‌యాదవ్, గెల్వయ్య, యూసుఫ్ షరీఫ్, కాలేరు రామకృష్ణ, కాలేరు రాజు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



సంతోష్‌కుమార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కిషన్‌రెడ్డి

కాచిగూడ: కార్యకర్తల కుటుంబాలకు అండగా బీజేపీ ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. బీజేపీ కాచిగూడ డివిజన్ అధ్యక్షుడు బండారు సంతోష్‌కుమార్ సంతాపసభ మంగళవారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పాల్గొని సంతోష్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పార్టీకోసం అంకిత భావంతో పనిచేసిన సంతోష్ సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. గత లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగరడంలో సంతోష్ చేసిన కృషి అభినందనీయమన్నారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటని ఈ సందర్భంగా గుర్తు చేశారు. బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతం రావు, మాజీ ఎమ్మెల్యే రాంచంద్రారెడ్డి, మధుసూదన్ రెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్యామ్‌రాజ్, ఏ.సూర్యప్రకాష్‌సింగ్, అజయ్‌కుమార్, శ్రీధర్, కన్నె రమేష్‌యాదవ్, కార్పొరేటర్లు వై.అమృత, పద్మ, కన్నె ఉమా రమేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

కాచిగూడ: కోట్ల విజయ భాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో జరిగిన ఓపెన్ నేషనల్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో కాచిగూడలోని జీవీఆర్ కరాటే అకాడమీ విద్యార్థులు పాల్గొన్నారు. 17 మంది విద్యార్థులు పాల్గొనగా.. 13 మంది విద్యార్థులు విజేతలుగా నిలిచారు. వీరిలో ఇద్దరు బంగారు, 5 మంది కాంస్య, 9 మంది రజత పతకాలను సాధించారు. గెలుపొందిన విద్యార్థుకు పతకాలు, సర్టిఫికెట్లను మంగళవారం కాచిగూడలోని అకాడమీలో హైకోర్టు సీనియర్ అడ్వకేట్ ఎస్.అశోక్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని పతకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ కరాటే నేర్చుకోవడం వల్ల తనను తాను రక్షించుకుని దేశాన్ని రక్షిస్తారన్నారు. ఆత్మరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కరాటే నేర్చుకోవాలని సూచించారు. కరాటే అకాడమీ డైరెక్టర్ డాక్టర్ జీఎస్ గోపాల్‌రెడ్డి, అమృత, షైనీ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సామాజిక ఆర్థికరంగంలో అర్థశాస్త్ర పాత్ర గణనీయం



సమావేశంలో డాక్టర్ రత్న తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగంలో అర్థశాస్త్రం పాత్ర గణనీయమైందని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళాశాలల అడ్మిన్ డైరెక్టర్ డాక్టర్ రత్న అన్నారు. మంగళవారం కళాశాలలో ఎంఏ ఎకనామిక్స్‌లో ద్వితీయ సంవత్సరం పూర్తి చేసుకున్న విద్యార్థులకు వీడ్కోలు సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులు దేశ ఆర్థిక రంగంలో జరుగుతున్న పరిణామాలపై దృష్టిసారించి దేశ ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.భవానీ, మేనేజ్‌మెంట్ ప్రతినిధి డాక్టర్ నాగరాజు, లా కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సృజన, పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విఠలాచారి, ఎకనామిక్స్ హెచ్ఓడీ డాక్టర్ వెంకటరమణ, విజేందర్, డాక్టర్ మధుకర్ తదితరులున్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



శంకర్‌లూక్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర మైనార్టీ కమిషన్ వైస్ చైర్మన్‌గా రెండోసారి నియమితులైన బి.శంకర్‌లూక్‌ను మంగళవారం బీఆర్ఎస్ యువజన విభాగం నగర నాయకుడు ముఠా జైసింహ, నియోజకవర్గ బీఆర్ఎస్ కమిటీ సంయుక్తాధ్వర్యంలో రాంనగర్‌లోని రాజ్ ఫంక్షన్‌హాల్‌లో ఘన సన్మానసభను నిర్వహించారు. ఈ సభకు భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ముఠా గోపాల్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ అన్ని వర్గాల ప్రజలకు సముచిత స్థానం కల్పిస్తున్నారన్నారు. ముఠా జైసింహ, క్రైస్తవ సంఘం నాయకులు సాల్మాన్‌రాజ్, శ్రావణ్‌కుమార్, కవాడిగూడ, అడిక్‌మెట్ డివిజన్‌ల బీఆర్ఎస్ అధ్యక్షులు శ్యామ్ యాదవ్, బల్లా శ్రీనివాస్‌రెడ్డి, ముషీరాబాద్ డివిజన్ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆకుల అరుణ్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్‌రెడ్డి, సీనియర్ నాయకులు శివముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి, మాధవ్, ఖదీర్, శ్యామ్‌సుందర్, అస్లాం, శంకర్‌ముదిరాజ్ తదితరులున్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

ముషీరాబాద్: ఆర్టీసీక్రాస్ రోడ్డులోని ముషీరాబాద్ ఐటీఐలో ఫ్యాషన్ డిజైన్ టెక్నాలజీ ట్రేడ్ కోసం కన్సాలిడెటేడ్ బోధన సిబ్బంది కోసం దరఖాస్తులకు ప్రిన్సిపాల్ ఆహ్వానించారు. అభ్యర్థులు 18-34 ఏళ్లున్న 4/3 సంవత్సరాల ఫ్యాషన్ డిజైన్ టెక్నాలజీ డిగ్రీ పొంది ఉండాలన్నారు. నెలకు రూ.22,750ల చొప్పున పారితోషకం చెల్లించబడుతుందని వివరించారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ దరఖాస్తు, విద్యార్హత సర్టిఫికెట్లను జతచేస్తూ ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని ముషీరాబాద్ ఐటీఐలో ఆగస్టు 10లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9440137907ను సంప్రదించాలని కోరారు.

ఆఫ్‌లైన్ దరఖాస్తులను కూడా సర్వే చేయాలి

ముషీరాబాద్: డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సర్వేలో ఆఫ్‌లైన్ దరఖాస్తులను సర్వే చేయడం లేదని సీపీఎం గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి శ్రీనివాస్ అన్నారు. ఆఫ్‌లైన్ దరఖాస్తులంతా అన్యాయానికి గురవుతున్నారని ఈ దరఖాస్తులను కూడా పరిశీలించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంత్రి కేటీఆర్‌కు లేఖ రాశారు. గ్రేటర్ హైదరాబాద్‌లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం ఆన్‌లైన్ దరఖాస్తులు మాత్రమే పరిశీలిస్తూ ఆఫ్‌లైన్ దరఖాస్తులను పూర్తిగా విస్మరించారన్నారు. దీని కారణంగా కలెక్టర్ ఆఫీసులో నేరుగా దరఖాస్తు చేసుకున్న ఆఫ్‌లైన్ దరఖాస్తుదారులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. హైదరాబాద్ జిల్లాలోనే కలెక్టర్ ఆఫీసుకు నేరుగా దరఖాస్తు చేసుకున్న వారు 2.84 లక్షల మంది ఉన్నారని వీరిని ఇళ్ల సర్వేలో భాగస్వాములు కాకుండా దూరంగా పెట్టారన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటున్న సందర్భంగానే సీఎం కేసీఆర్ ఆఫ్‌లైన్‌లో కూడా పిలుపునివ్వడంతో ప్రజలు పెద్దఎత్తున దరఖాస్తు చేసుకున్నారన్నారు. వెంటనే ఆఫ్‌లైన్ ధరఖాస్తులను కూడా సర్వే చేయాలన్నారు.

ప్రజల సహకారంతో శాంతిభద్రతల పరిరక్షణ

చిక్కడపల్లి: ప్రజల సహకారంతో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తున్నట్లు చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ పిడమర్తి నరేష్ అన్నారు. గాంధీనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అభిషేక్ కెన్నడీ మంగళవారం ఆయనను సన్మానించి అభినందించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అన్ని జాగ్రతలు చేపడతామన్నారు. ఈ పోలీస్‌స్టేషన్‌కు అదనపు ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన అనుభవం ఉన్న దృష్ట్యా ఈ ప్రాంతంపై పూర్తి అవగాహన ఉందన్నారు. కాంగ్రెస్ నాయకులు మజార్‌హుస్సేన్, నరేందర్‌యాదవ్, పీటర్, బెన్ని తదితరులు పాల్గొన్నారు.

విశ్వరూప సభను జయప్రదం చేయండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఆగస్టు రెండో వారంలో జరిగే మాదిగల విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలని ఎంఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు సందే కార్తీక్ మాదిగ కోరారు. మంగళవారం ఓయూలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కొమ్ముశేఖర్, అజయ్‌మాదిగ, మహేష్ మాదిగ, ప్రదీప్, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

'కార్మిక గర్జన' పోస్టర్ ఆవిష్కరణ



ముషీరాబాద్: ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ఆగస్టు 4న కార్మికుల సమస్యల పరిష్కారానికై కార్మిక గర్జన నిర్వహిస్తుందని హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల అధ్యక్షులు ఎస్.ఎల్.పద్మ తెలిపారు. మంగళవారం విద్యానగర్‌లోని మార్క్స్‌భవన్‌లో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కనీస వేతన జీవోను విడుదల చేయాలని, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక కోర్డులను రద్దు చేయాలన్నారు. కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి మీటర్ చార్జీలను పెంచాలని కోరారు. కార్మిక గర్జనలో రాష్ట్ర వ్యాప్తంగా కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి వి.ప్రవీణ్, ఎం.అన్వేష్, వి.కిరణ్, రవీందర్, నీసార్, అఫ్జల్, వెంకటేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'విద్య, వైద్యాభివృద్ధిలో ప్రభుత్వాలు విఫలం'



సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: విద్య, వైద్యం అభివృద్ధిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యారని సోషల్ డెమాక్రటిక్ ఫోరం కన్వీనర్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళీ అన్నారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సోషల్ డెమాక్రటిక్ ఫోరం ఆధ్వర్యంలో వైద్య, ఆరోగ్య అభివృద్ధికి ప్రతిపాదనలు అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో 'వైద్య, ఆరోగ్యసేవలు ఎట్లుండాలి'? అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వైద్యరంగం బలహీనంగా ఉండటం వల్ల కరోనాకాలంలో మనుషులు పిట్టల్లా రాలిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల్ని ఇంకా మోసం చేయకుండా నాణ్యమైన వైద్యాన్ని అందించాలని దీనికి అన్ని రాజకీయ పార్టీలు మ్యానిఫెస్టోలో చేర్చాలని డిమాండ్ చేశారు. వైద్య రంగానికి బడ్జెట్‌లో 4 శాతమే కేటాయించడం బాధాకరమన్నారు. మంత్రి హరీష్‌రావు కార్మికులకు బీమా ఇస్తున్నట్లు ప్రకటించారని బడ్జెట్‌లో వైద్యరంగం వాటాను పెంచాలన్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లో వైద్య రంగానికి 6 శాతానికి ఖర్చు చేస్తుంటే మనదేశంలో 1 శాతమే ఖర్చు చేస్తున్నారని విమర్శించారు. ప్రొఫెసర్ డాక్టర్ రమ, డాక్టర్ ప్రీతి, డాక్టర్ సురేందర్‌రెడ్డి, డాక్టర్ శ్రీనివాస్, డీబీఎఫ్ జాతీయ కన్వీనర్ పి.శంకర్, సామాజిక కార్యకర్త ఆంజనేయులు, ఎంవీ ఫౌండేషన్ జాతీయ కన్వీనర్ ఆర్.వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'కవులు కళాకారులు పరిశుద్ధ ఆత్మకలవారు'



పురస్కారం అందజేస్తున్న కొలకలూరి ఇనాక్, శంకర్‌నారాయణ తదితరులు

చిక్కడపల్లి: కవులు కళాకారులు పరిశుద్ధ ఆత్మకలవారని వారే సమాజానికి దిశానిర్దేశం చేయగల్గుతారని వేంకటేశ్వర విశ్వవిద్యాలయం విశ్రాంత ఉపాధ్యక్షుడు ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. మంగళవారం సాయంత్రం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో డాక్టర్ ఆలూరి విల్సన్ జన్మదినం సందర్భంగా కవిసమ్మేళనం నృత్యసంగీత కార్యక్రమాలు 10 గంటలపాటు జరిగాయి. ముఖ్యఅతిథిగా ఆచార్య ఇనాక్ పాల్గొని మాట్లాడారు. సాహిత్యం సమాజ ప్రగతికి మానవాళి అభ్యుదయానికి దోహదపడుతుందన్నారు. నారాయణస్వామి వ్యాఖ్యానం దోహదపడుతుందన్నారు. నారాయణస్వామి వ్యాఖ్యానంలో ఇనాక్‌కు దాశరథి స్మారక పురస్కారం, హాస్యఅవధాని శంకరనారాయణకు సినారె స్మారక పురస్కారం, గాయని ఇందిరకు వాణీజయరాం స్మారక పురస్కారం పలువురు ప్రముఖులకు, కవులు కళాకారులకు పురస్కారాలు బహుకరించారు.

సమస్యల పరిష్కారం



అడ్డగుట్ట: సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని పరిష్కరిస్తున్నామని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు లింగాని శ్రీనివాస్ తెలిపారు. వారం రోజులుగా కురిసిన వర్షాలకు పలు బస్తీల్లో పొంగిపొర్లుతున్న డ్రైనేజీ మ్యాన్‌హోళ్లను మంగళవారం మున్సిపల్ సిబ్బందితో శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. తుకారాంగేట్ మరాఠా బస్తీతో పాటు పలు బస్తీల్లో డ్రైనేజీ సమస్యలను పరిష్కరించినట్లు తెలిపారు. అదే విధంగా రోడ్లకు ఇరువైపులా పెరిగిన చెట్ల కొమ్మలను సంబంధిత సిబ్బందితో తొలగింపజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు సుధాకర్, శ్రీరాములు, వడ్లూరి రవి, గోపి, బాబు పాల్గొన్నారు.

అభినందన

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన పిడమర్తి నరేష్‌ను ముషీరాబాద్ కాంగ్రెస్ పార్టీ బి-బ్లాక్ అధ్యక్షుడు అంజియాదవ్ అభినందనలు తెలిపారు. మంగళవారం సీఐ పిడమర్తి నరేష్‌ను కలిసి శాలువాతో సన్మానించి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

కార్పొరేట్ అనుకూల విధానాలు సరికాదు



కేంద్ర కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న మద్దికాయల అశోక్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కార్పొరేట్ అనుకూల, దేశ ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా బీజేపీ ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటూ ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తోందని ఎంసీపీఐయూ జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్ ఆరోపించారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని ఓంకార్ భవన్‌లో జరిగిన ఎంసీపీఐయూ జాతీయ కమిటీ ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. మణిపూర్ ప్రజల జీవితాలు చిన్నాభిన్నం అవుతున్నా.. కేంద్ర ప్రభుత్వం అంటీముట్టనట్లుగా వ్యవహరిస్తోందని విమర్శించారు. మైనార్టీ వర్గ ఆదీవాసీ కుకీ ప్రజల ప్రాణాలకు ఎలాంటి రక్షణ కల్పించకపోవడం హేయమైన చర్య అన్నారు. మణిపూర్ ముఖ్యమంత్రిని బర్తరఫ్ చేసి అక్కడ శాంతిని నెలకొల్పడంతో పాటు నష్టపోయిన ప్రజలకు ఆర్థికసాయం చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర కమిటీ సభ్యులు కె.గంగాధరణ్, కిరణ్ సేకోన్‌ల అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జాతీయ నాయకులు మంగత్‌రామ్ పాస్లా, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి తదితరులు పాల్గొన్నారు.

ఐపీఎంలో బోనాల వేడుకలు



కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్ తదితరులు

కాచిగూడ: నారాయణగూడలోని ఐపీఎంలో బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఐపీఎం ఉద్యోగులు, అధికారులు, మహిళా ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలను సమర్పించారు. ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్, ఐపీఎం డైరెక్టర్ డాక్టర్ శివలీల, టీఎన్జీఓ అసోసియేట్ అధ్యక్షుడు డాక్టర్ ఎం.సత్యనారాయణగౌడ్, ఐపీఎం కార్యదర్శి జ్ఞానేశ్వర్, నర్సిరెడ్డి, ఎం.శ్రీనివాస్‌రావు, ఆర్.నవీన్, మహేష్‌కుమార్, డాక్టర్ ఉమాదేవి, డాక్టర్ విజయశాంతి, ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

తల్లి ముర్రుపాలు బిడ్డకు మొదటి టీకా లాంటిది

ఎంవీ ఫౌండేషన్ ఆర్గనైజర్ సువర్ణ



బాలామృతం, గుడ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

అడ్డగుట్ట: నవజాత శిశువులకు వెంటనే తల్లి ముర్రుపాలు పట్టించడం ద్వారా బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని ఎంవీ ఫౌండేషన్ ఆర్గనైజర్ ఎ.సువర్ణ చెప్పారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మారేడుపల్లి మండల పరిధిలోని అడ్డగుట్ట 1, 4 అంగన్వాడీ కేంద్రాల్లో తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సువర్ణ మాట్లాడుతూ.. తల్లి ముర్రుపాలు బిడ్డకు మొదటి టీకా లాంటిదని, అదే విధంగా తల్లికి కూడా బ్రెస్ట్ కేన్సర్ రాకుండా ఉంటుందని తెలిపారు. ఆరు నెలల వరకు తల్లిపాలు తాగించడం ద్వారా బిడ్డకు ఏ విధమైన అనారోగ్య సమస్యలు రావని, బిడ్డకు ఎదుగుదలకు ఎంతో తోడ్పడుతుందన్నారు. అనంతరం బాలింతలకు గుడ్లు, బాలామృతం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు ఎన్. పద్మ, జే. రమాదేవి, తల్లులు వాణి, ముక్తి, రుక్మిణి, రచన, అనూష తదితరులు పాల్గొన్నారు.